క్లుప్తంగా

చేపల మృతిపై విచారణ జరిపించండి

సంగారెడ్డి టౌన్: పటాన్‌చెరువు మండలం.. చిట్కూల్ గ్రామ పరిధిలో ఉన్న పెద్ద చెరువులో చేపలు మృత్యువాత పడటంతో జిల్లా స్థాయి అధికారులు వెంటనే విచారణ జరిపించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అతిమేల మానిక్ శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. పెద్ద చెరువులో చేపలు చనిపోవడంతో వాటి మీద ఆధారపడిన మత్స్యకారులు తీవ్రంగా నష్టపోయారని ఆందోళన వ్యక్తం చేశారు. కాలుష్య కారక పరిశ్రమలు విడుదల చేస్తున్న జలాలతోనే చేపలు మృత్యువాత పడ్డాయని తెలిపారు. ప్రభుత్వం వెంటనే కాలుష్య కారక పరిశ్రమలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మత్స్యకారులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని కోరారు.

ఉద్యోగ విరమణ సహజమే

సంగారెడ్డి టౌన్: ప్రభుత్వ ఉద్యోగులకు ఉద్యోగ విరమణ సహజమేనని ఆర్టీసీ ఆర్‌ఎం ప్రభులత అన్నారు. సంగారెడ్డి ఆర్టీసీ డిపోలో ఉద్యోగ విరమణ పొందిన 5 మంది ఉద్యోగులకు శనివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఉద్యోగి తాను ఉద్యోగం చేసే సమయంలో చేసిన సేవలు ఎప్పటికీ గుర్తుండిపోతాయని వివరించారు. కార్యక్రమంలో ఆర్టీసీ సంగారెడ్డి డిపో మేనేజర్ ఉపేందర్, కండక్టర్లు, డ్రైవర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

బోనాల పండుగ ఏర్పాట్లపై సమావేశం

పటాన్‌చెరు టౌన్: రానున్న బోనాల పండుగ ఏర్పాట్లపై విద్యుత్‌శాఖ అధికారులతో కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ శనివారం సమావేశం నిర్వహించారు. డివిజన్ పరిధిలోని ఆలయాల వద్ద పారిశుద్ధ్య పనులతో పాటు విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని కోరారు. పలారం బండి ఊరేగింపు సమయంలో విద్యుత్ సమస్య లేకుండా చూడాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ సురేశ్ కుమార్, నికిత, ఎలక్ట్రికల్‌శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఉన్నతమైనది ఉపాధ్యాయ వృత్తి

న్యాల్‌కల్(జహీరాబాద్): ఉపాధ్యాయ వృత్తి ఎంతో ఉన్నతమైనదని, తాము చేసిన సేవలకు ఎప్పుడూ గుర్తింపు ఉంటుందని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎస్‌ఐ రామానాయుడు అన్నారు. పదవీ విరమణ పొందిన ఇంద్రసేనారెడ్డికి పాఠశాలలో శనివారం వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులను ఉత్తములుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల కృషి ఎనలేనిదన్నారు. ఈ సందర్భంగా ఇంద్రసేనారెడ్డిని ఉపాధ్యాయులు, ప్రజా ప్రతినిధులు శాలువా, పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బి.శ్రీనివాస్‌రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తిరుపతిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ సిద్ధి లింగయ్యస్వామి తదితరులు పాల్గొన్నారు.

ధర్మపురి శ్రీనివాస్ మృతిపై నేతల సంతాపం



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్: మాజీ మంత్రి, పీసీసీ అధ్యక్షుడు ధర్మపురి శ్రీనివాస్ అకస్మిక మృతి పట్ల జహీరాబాద్ ఎంపీ సురేష్‌షెట్కార్, నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు. 2004 నుంచి 2009 వరకు తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు ఆయనతో తనకు సాన్నిహిత్యం ఉండేదని షెట్కార్ గుర్తు చేసుకున్నారు. ఎమ్మెల్యే సంజీవరెడ్డి హైదరాబాద్‌లో శ్రీనివాస్ మృతదేహం వద్ద రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, వివిధ పార్టీల నాయకులతో కలిసి నివాళులు అర్పించారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



జిన్నారం(పటాన్‌చెరు): గుర్తు తెలియని వ్యక్తి అనుమానాస్పందంగా మృతి చెందాడు. ఎస్‌ఐ మహేశ్వర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గుమ్మడిదల మండల కేంద్రంలోని బస్టాప్ సమీపంలో వ్యక్తి మృతి చెందాడన్న విషయాన్ని స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. మృతి చెందిన వ్యక్తి కుడి చేతిపై త్రిశూలం ఆకారంలో పచ్చబొట్టు ఉంది. మృతుడి వయస్సు 30 నుంచి 35 ఏళ్లు ఉంటుంది. మృతదేహాన్ని ఎవరైన గుర్తిస్తే పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని సూచించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

నిత్యం ఎదురుచూపులే..

- మండల కేంద్రానికి పూర్తిగా తగ్గిన ఆర్టీసీ బస్సుల సేవలు
- ఆటోలను ఆశ్రయిస్తున్న ప్రయాణికులు
- బస్సుల సర్వీసులను పెంచాలని స్థానికుల విజ్ఞప్తి



జిన్నారం ఆర్టీసీ డిపో

మండల కేంద్రానికి వచ్చే ఆర్టీసీ బస్సుల సంఖ్య పూర్తిస్థాయిలో తగ్గిపోయింది. దీంతో వివిధ గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బస్సు సర్వీసుల సౌకర్యం కల్పించేందుకు ఆర్టీసీ అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. జిన్నారం మండల కేంద్రానికి ఆర్టీసీ బస్సుల సంఖ్య పూర్తిగా తగ్గింది. మండల కేంద్రం నుంచి పటాన్‌చెరు, బాలానగర్, సికింద్రాబాద్, నర్సాపూర్, సంగారెడ్డి పట్టణాలకు వెళ్లేందుకు ఉద్యోగులు, కార్మికులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

– జిన్నారం(పటాన్‌చెరు)

తప్పని అవస్థలు

మండల పరిధిలోని బొల్లారం, గడ్డపోతారం, ఖాజీపల్లి, శివానగర్ తదితర దూర గ్రామాల నుంచి మండల కేంద్రానికి వెళ్లేందుకు సరైన బస్సు సౌకర్యం లేదు. ఉన్న అరకొర ఆర్టీసీ బస్సులు ఎప్పుడూ వస్తాయో రాబో తెలియని పరిస్థితి ఉంది. దీంతో ప్రయాణికులకు అవస్థలు తప్పడంలేదు. నర్సాపూర్, పటాన్‌చెరు, జీడిమెట్ల డిపోలకు చెందిన ఆర్టీసీ బస్సులు గతంలో వచ్చేవి. ఇప్పుడు కేవలం పటాన్‌చెరు, నర్సాపూర్ డిపోలకు చెందిన బస్సులు మాత్రమే నడుపుతున్నారు. అవికూడా కేవలం ఉదయం, సాయంత్రం ట్రిప్పులు మాత్రమే. ప్రభుత్వం ఉచిత బస్సు సౌకర్యం కల్పించినా తాము సద్వినియోగం చేసుకోవడంలేదని పలువురు మహిళలు వాపోతున్నారు.

అధికారులతో మాట్లాడుతున్నాం

సోలక్‌పల్లి నుంచి వస్తున్న నర్సాపూర్ ఆర్టీసీ డిపో బస్సును జిన్నారం మీదుగా వెళ్లే విధంగా ఇటీవల బస్సు సర్వీసును వేయించాం. మరిన్ని బస్సుల సౌకర్యం కల్పించాలని ఆర్టీసీ అధికారులు, డిపో మేనేజర్లతో మాట్లాడుతున్నాం. త్వరలోనే బస్సుల సమస్య పరిష్కారమవుతుంది.

– రవీందర్‌గౌడ్, ఎంపీపీ

సమాయానికి రాని బస్సులు

ఆర్టీసీ బస్సులు సమయానికి లేకపోవటంతో వాహనదారులు చేసేదేమీలేక ఆటోలను ఆశ్రయిస్తున్నారు. దీంతో ఆటో చార్జీలు కూడా అదనంగా అవుతున్నాయని ప్రయాణికులు వాపోతున్నారు. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి అయా గ్రామాలను కలుపుతూ జిన్నారం మండల కేంద్రానికి బస్సు సౌకర్యాలను కల్పించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

సొసైటీ అవకతవకలపై విచారణ

రామచంద్రాపురం(పటాన్ చెరు): విద్యుత్ నగర్ కాలనీ సొసైటీలో అవకతవకలపై గతంలో పలువురు చేసిన ఫిర్యాదు మేరకు అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఎస్.రామకృష్ణ శనివారం విచారణ చేపట్టారు. కాలనీ సొసైటీ అధ్యక్షుడు, కార్యవర్గ సభ్యులతో మాట్లాడి రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం మాట్లాడుతూ జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ విచారణ ప్రారంభించామన్నారు. మరికొన్ని రికార్డులను పరిశీలించాల్సి ఉందని, రెండు, మూడు రోజుల్లో తమకు అందజేస్తామని సొసైటీ కమిటీ సభ్యులు తెలిపారని చెప్పారు. అనంతరం ఎంబీజీ హౌసింగ్ సొసైటీ అధ్యక్షుడు ఎస్.అబ్దుల్ అజీమ్ మాట్లాడుతూ తమపై నిరాధారణమైన ఆరోపణలు చేస్తున్నారని, కాలనీ అభివృద్ధికి అన్ని విధాలుగా దోహదపడుతున్నామని చెప్పారు.

ఈఎస్ఐ ఆస్పత్రిని ఆధునీకరించాలి

సీఐటీయూ నేత మహిపాల్



మాట్లాడుతున్న మహిపాల్

జహీరాబాద్ టౌన్: స్థానిక ఈఎస్ఐ ఆసుపత్రిని అప్‌గ్రేడ్ చేయాలని సీఐటీయూ పారిశ్రామిక క్లస్టర్ డివిజన్ కన్వీనర్ మహిపాల్ కోరారు. శనివారం నిర్వహించిన మహీంద్ర అండ్ మహీంద్ర కర్మాగారం కార్మిక యూనియన్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. మూడు వేల మంది ఈఎస్ఐ కార్డు హోల్డర్లు ఉన్నారని, కార్మికుల నుంచి బోర్డుకు సుమారు రూ.25లక్షల జమఅవుతున్నాయని చెప్పారు. అయినా డిస్పెన్సరీలో కనీస వసతులు కరువయ్యాయని, డాక్టర్లు కూడా లేకపోవడంతో కార్మికులకు వైద్యసేవలు అంతంత మాత్రంగానే అందుతున్నాయని వాపోయారు. అందుకే 50పడకల ఆసుపత్రి ఏర్పాటు చేయాలని కోరారు. సమావేశంలో సీఐటీయూ ప్రధాన కార్యదర్శి రాజిరెడ్డి, నాయకులు గణేశ్, నరేశ్, బాల్‌రాజ్, వంశీ కృష్ణ, ఇస్మాయిల్ పాల్గొన్నారు.



ట్రాన్స్‌ఫార్మర్‌కు అల్లుకున్న పిచ్చిమొక్కల తీగలు

● అల్లుకున్న నిర్లక్ష్యం

ఝరాసంగం(జహీరాబాద్): విద్యుత్ స్తంభాలు, తీగలకు అల్లుకున్న పిచ్చిమొక్కలు ప్రమాదాలకు దారితీసే అవకాశం ఉంది. కేతకీ సంగమేశ్వర ఆలయ ఆవరణలోని అన్నదాన సత్రం పక్కనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ పిచ్చిమొక్కలు, పొదలు ఏపుగా పెరిగాయి. అదేవిధంగా జహీరాబాద్ వెళ్లే ప్రధాన రహదారి పక్కన కుప్పానగర్ శివారులో ఉన్న విద్యుత్ స్తంభాల వద్ద పిచ్చిమొక్కల తీగలు ప్రమాదకరంగా అల్లుకున్నాయి. వర్షాలు కురిసిన సమయంలో ప్రమాదాలు సంభవించే అవకాశం ఉంది. దీంతో విద్యుత్ అధికారులు వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికుల కోరుతున్నారు.

చిగురించిన రైతుల ఆశలు



మొలకెత్తిన సోయాబిన్ విత్తనాలు



రాయికోడ్ శివారులో సాగవుతున్న పత్తి పంట

- వ్యవసాయ పనుల్లో నిమగ్నం
- హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు

జహీరాబాద్ టౌన్: జహీరాబాద్ వ్యవసాయ శాఖ డివిజన్ పరిధిలోని రైతుల ఆశలు మొలకెత్తాయి. ఖరీఫ్ సీజన్ సాగు ప్రారంభమై రెండు వారాలు దాటినా సరైన వర్షాలు లేక వేసిన విత్తనాలు మొలకెత్తవన్న ఆందోళన రైతుల్లో వీడింది. అడపాదడపా కురుస్తున్న జల్లులకు నాటిన విత్తనాలు మొలకెత్తుతున్నాయి. దీంతో రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమవుతున్నారు. జహీరాబాద్ వ్యవసాయ డివిజన్ పరిధిలో శాశ్వత నీటి వనరులు లేవు. అధిక శాతం వర్షాలపైనే ఆధారపడి పంటలను సాగు చేస్తుంటారు. నియోజకవర్గంలో వందల ఎకరాల్లో పత్తి, కంది, సోయాబిన్ విత్తనాలు నాటారు. ఖరీఫ్ సీజన్ తొలకరి జల్లులు చూసిన రైతులు ధైర్యం చేసి విత్తనాలు నాటారు. కానీ.. సరైన సమయానికి వర్షాలు లేనందున విత్తనాలు మాడిపోతాయన్న ఆందోళన రైతుల్లో వ్యక్తమైంది. బోరుబావులు కలిగిన రైతులు బిందుసేద్యం ద్వారా నీటి తడులు అందిస్తున్నారు. ఎక్కువమంది రైతుల తుపంర సేద్యం(స్ప్రింకర్లు)పై ద్వారా నీటి తడులు ఇచ్చారు. మధ్యలో ఒకటి రెండు వర్షాలు గట్టిగా పడడంతో రైతులకు ప్రాణంలేసి వచ్చింది. అక్కడక్కడ కురుస్తున్న వానలు పంటకు ఊరటనిస్తున్నాయి. న్యాల్‌కల్, ఝరాసంగం, కోహీర్, రాయికోడ్, జహీరాబాద్, మొగుడంపల్లి మండలాల్లోని వర్షభావ పరిస్థితులు కనిపించాయి. ఆయా ప్రాంతాల్లోని ఎర్రనేలలో వేసిన విత్తనాలు మొలకెత్తని కారణంగా రెండోసారి విత్తనాలు నాటేందుకు రైతులు సిద్ధమవుతున్నారు. రెండు రోజుల నుంచి మేఘాలు కమ్ముకోవడంతో వర్షాలు కురుస్తాయన్న నమ్మకంతో రైతులు ఉన్నారు.

పంటలకు ప్రాణం పోసిన వర్షం

రాయికోడ్(అందోల్): వారం రోజులుగా వర్షాల జాడ లేక రైతులు సాగు చేసిన పత్తి పంట మొక్కలు ఆశించిన స్థాయిలో ఎదగలేదు. దీంతో రైతులు వర్షాల కోసం ఎదురుచూస్తూ పంట సాగు పనుల్లో నిమగ్నమయ్యారు. ఎట్టకేలకు శనివారం సాయంత్రం మండల వ్యాప్తంగా ఓ మోస్తరు వర్షం కురవడంతో రైతులకు ఊరట లభించింది. మండలంలో సుమారు 35 వేల ఎకరాలకు పైగా పత్తి పంట సాగు చేశారు. రూ.వేలల్లో పెట్టుబడులు వెచ్చించి పత్తిని సాగు చేసిన రైతులు వర్షాలు ముఖం చాటేయడంతో కలవరపడ్డారు. తాజాగా కురిసిన వర్షంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

బోధనతోనే ప్రశాంతత

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): విద్యాబోధనతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని రిటైర్డ్ ఎంఈఓ దండు అంజయ్య అన్నారు. శనివారం మండల పరిధిలోని పెద్దాపూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు తెలుగు, గణితం బోధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశ్రాంత ప్రధానోపాధ్యాయులు, ఉద్యోగులు, మహిళలు తమకు దగ్గరలో ఉన్న ఏదో ఒక పాఠశాలల్లో రోజుకు కనీసం ఒక గంట బోధించాలని పిలుపునిచ్చారు. అనంతరం వన మహోత్సవంలో పాల్గొని మొక్కలు నాటారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు కృష్ణయ్య, గోపి ఉపాధ్యాయులు భాగ్య లక్ష్మి, సీఆర్పీ రాజేశ్వర్, పాల్గొన్నారు.

కఠిన చర్యలు తీసుకోవాలి

మునిపల్లి(అందోల్): ప్రభుత్వ పాఠశాలల్లో తమ విధులపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలని తీన్మార్ మల్లన్న టీం సభ్యుడు రమేశ్ యాదవ్ డిమాండ్ చేశారు. మునిపల్లి మండలం గార్లపల్లి గ్రామ యూపీఎస్, ఎన్‌పీఎస్ పాఠశాలలను శనివారం ఆయన సందర్శించారు. విద్యార్థుల నుంచి వివరాలు సేకరించారు. ఉపాధ్యాయులు ఇష్టానుసారంగా విధులకు హాజరవుతున్నట్లు గుర్తించామని, వంతుల వారీగా ఉపాధ్యాయులు విధులకు వస్తున్నట్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధ్యత లేకుండా వ్యవహరిస్తున్న ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

బస్సు సౌకర్యం కల్పించండి

జిన్నారం(పటాన్‌చెరు): ఖాజీపల్లి గ్రామానికి బస్సు సౌకర్యాన్ని కల్పించాలని కోరుతూ ఖాజీపల్లి కాలుష్య నివారణ జేఏసీ కమిటీ చైర్మన్ దండె రమాకాంత్ ఆధ్వర్యంలో శనివారం సచివాలయంలో మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రమాకాంత్ మాట్లాడుతూ గ్రామానికి బస్సు సౌకర్యం లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించినట్లు తెలిపారు. దీంతో మంత్రి సానుకూలంగా స్పందించి ఆర్టీసీ అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని హామీనిచ్చినట్లు తెలిపారు. అదేవిధంగా పీసీడీ ఎంఎస్‌కు వినతిపత్రం అందించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సయ్యద్ రయీస్, కుమార్‌యాదవ్, మహేష్, నాగరాజు, హుస్సేన్, బాలు, వెంకటేశ్, వడ్ల భరత్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ సింధురెడ్డి

రామచంద్రాపురం (పటాన్ చెరు): భారతీనగర్ డివిజన్ పరిధిలోని సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కార్పొరేటర్ సింధురెడ్డి శనివారం జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డివిజన్ పరిధిలో అభివృద్ధి పనులు చేపట్టేందుకు రూ.2కోట్లతో ప్రతిపాదనలు చేశారని, పోచమ్మ అలయం పక్కన నిర్మిస్తున్న కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి అదనంగా రూ.95 లక్షలు మంజూరు చేయాలని కోరినట్లు తెలిపారు. అందుకు జోనల్ కమిషనర్ సానుకూలంగా స్పందించినట్లు చెప్పారు. నాయకులు ఆదర్శ్‌రెడ్డి, ఉన్నారు. రామచంద్రాపురం కార్పొరేటర్ పుష్ప తమ డివిజన్ పరిధిలోని నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ జోనల్ కమిషనర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు.

సాయిచంద్‌కు ఘన నివాళి



సాయిచంద్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

జహీరాబాద్ టౌన్: తెలంగాణ ఉద్యమ కళాకారుడు, మాజీ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దివంగత సాయిచంద్ వర్ధంతి సందర్భంగా బీఆర్‌ఎస్ నాయకులు ఘనంగా నివాళులర్పించారు. పట్టణంలోని ఆ పార్టీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు, మాజీ కౌన్సిలర్ నామరవికిరణ్ గుప్తా తదితరులు సాయిచంద్ చిత్రపటానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో సాయిచంద్ పాత్ర మరవలేనిదన్నారు. చిన్నతనంలోనే సాయిచంద్ మరణించడం బాధాకరమన్నారు. ఆయన మరణం బీఆర్‌ఎస్ పార్టీకి, కళారంగానికి తీరని లోటని తెలిపారు. సాయిచంద్ ఆశయసాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని సూచించారు. నాయకులు యాకూబ్, తులసిదాస్ గుప్తా, బండి మోహన్, శివప్ప, కనుకుంట్ల శ్రీకాంత్, విజయ్, ప్రభు యాదవ్ పాల్గొన్నారు.

చెక్కులు మంజూరు

వట్‌పల్లి(అందోల్): వట్‌పల్లి మండలానికి కల్యాణ లక్ష్మి, షాదిముబారక్ సంక్షేమ పథకాలకు సంబంధించిన 21 చెక్కులు మంజూరైనట్లు డిప్యూటీ తహసీల్దారు శంభిరెడ్డి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఒక్కొక్క చెక్కు రూ.100116 చొప్పున మంజూరైనట్లు తెలిపారు. ప్రభుత్వం నుంచి మంజూరైన చెక్కులను త్వరలోనే లబ్ధిదారులకు పంపిణీ చేస్తామని పేర్కొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ కుక్కల దాడిలో లేగదూడ మృతి



ఝరాసంగం(జహీరాబాద్): కుక్కల దాడిలో లేగదూడ మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని తుమ్మన్‌పల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని సంగం(కె)లో శనివారం చోటుచేసుకుంది. బాధిత రైతు అంజిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. పాడి ఆవుకు సంవత్సరం వయసు ఉన్న లేగదూడ ఉంది. రోజు మాదిరిగానే ఝరాసంగం గ్రామశివారులో మేత మేస్తున్న క్రమంలో గుంపులుగా వచ్చిగా వీధి కుక్కలు ఒక్కసారిగా దాడికి పాల్పడ్డాయి. దీంతో తీవ్ర గాయపడిన లేగదూడ అక్కడికక్కడే మృతి చెందింది. మృతి చెందిన దూడ విలువ సుమారు రూ.5000 వరకు ఉంటుందని బాధిత రైతు పేర్కొన్నాడు. పశువులపై దాడులు చేస్తున్న వీధి కుక్కలపై అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరారు.

◆ జింకపై వీధికుక్కల దాడి

ఝరాసంగం(జహీరాబాద్): జింకపై కుక్కల దాడి చేశాయి. ఈ ఘటన మండల పరిధిలోని బర్దిపూర్ గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. శివారులో ఉన్న అటవీ ప్రాంతం నుంచి మూడు జింకలు దారితప్పి గ్రామంలోకి ప్రవేశించాయి. ఈ క్రమంలో గ్రామంలోని వీధికుక్కలు జింకలపై దాడి చేశాయి. దాడిలో రెండు జింకలు తప్పించుకోగా మరో జింకకు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన గ్రామస్తులు కుక్కల బారి నుంచి జింకను కాపాడి అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ రాజు సిబ్బందితో వచ్చి జింకకు ప్రథమ చికిత్స నిమిత్తం ఝరాసంగం పశువైద్యశాలకు తరలించారు. కుక్కల బారి నుంచి జింకను రక్షించిన గ్రామస్తులను అధికారులు అభినందించారు.

◆ రైతుభరోసాపై అభిప్రాయ సేకరణ

మునిపల్లి(అందోల్): మండల పరిధిలోని పెద్ద చెల్మెడ వ్యవసాయ సహకార సంఘం కార్యాలయం పరిధిలోని ఆయా గ్రామాల రైతుల నుంచి రైతు భరోసా పథకంపై శనివారం అభిప్రాయాలను సేకరించారు. జిల్లా సహకార సంఘం అధికారి తుమ్మ ప్రసాద్, ఏఓ శివకుమార్ రైతులతో ముచ్చటించి రైతుభరోసా పథకాన్ని ఏయో రైతులకు, ఎంత భూవిస్తీర్ణం ఉన్న రైతులకు అందించాలనే అంశంపై అభిప్రాయాలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ పద్మ, సహకార సంఘం సీనియర్ అసిస్టెంట్ కవిత, జూనియర్ అసిస్టెంట్ రాథోడ్ సందీప్, సొసైటీ డైరెక్టర్లు పాల్గొన్నారు.

◆ విద్యార్థులకు పుస్తకాల పంపిణీ



రామచంద్రాపురం (పటాన్ చెరు): స్థానిక మండల ప్రాథమిక పాఠశాలలో బీఎస్పీ నాయకుడు సుంకు వినయ్ కుమార్, రాధిక దంపతులు శనివారం విద్యార్థులకు ఉచితంగా నోటు పుస్తకాలను పంపిణీ చేశారు. శనివారం బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేద విద్యార్థులను ప్రోత్సహించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. ప్రతియేటా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పుస్తకాలను అందిస్తున్నట్లు తెలిపారు. బీఎస్పీ శ్రీశైలం, జనార్దన్, దశరథ్, రాజేందర్, వెంకట్ పాల్గొన్నారు.

◆ నైబర్‌హుడ్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం

రామచంద్రాపురం(పటాన్ చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ కార్యాలయ ఆవరణలో శనివారం తెల్లాపూర్ నైబర్ హుడ్ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్మికులకు ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వైద్య శిబిరాన్ని మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ శంషాబాద్ రాజు, తెల్లాపూర్ నైబర్‌హుడ్ అసోసియేషన్ అధ్యక్షుడు ఈశ్వరగారి రమణ పాల్గొన్నారు.

◆ కబ్జా నుంచి కాపాడండి

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని సీతారామయ్య కాలనీలో రహదారిని కబ్జాచేసిన వారిపై చర్యలు తీసుకోవాలని డిప్యూటీ కమిషనర్ సురేశ్, కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్‌కు కాలనీవాసులు వినతిపత్రం అందజేశారు. రహదారిని కబ్జాచేసి దారిమూసి వేయడంతో కాలనీవాసులు శనివారం ఆందోళనకు దిగారు. అక్రమ లేఔట్‌ను అడ్డుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం కార్పొరేటర్ మెట్టు కుమార్ మాట్లాడుతూ పాత పటాన్‌చెరు ప్రాంతానికి వెళ్లే దారిని మూసివేస్తూ ప్రహరీ నిర్మించడం సరికాదన్నారు. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకువెళ్లి అక్రమ నిర్మాణాలను అడ్డుకుంటామని హెచ్చరించారు.

◆ ఎల్‌ఓసీ అందజేత

నారాయణఖేడ్: నిజాంపేట మండల పరిధిలోని బల్కంచెల్క తండాకు చెందిన పాండ్యానాయక్ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లోని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. అయితే వైద్య ఖర్చులు అధికమవడంతో ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేసుకున్నాడు. దీంతో సీఎం సహాయనిధి ద్వారా మంజూరైన రూ.2.10లక్షల ఆర్థిక సాయానికి సంబంధించిన లెటర్ ఆఫ్ క్రెడిట్ (ఎల్‌ఓసీ)ని మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి శనివారం ఖేడ్‌లోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో పాండ్యానాయక్ కుటుంబీకులకు అందజేశారు. నారాయణఖేడ్ జెడ్పీటీసీ లక్ష్మీబాయి, జిల్లా విజిలెన్స్ కమిటీ మాజీ సభ్యుడు రవీందర్‌నాయక్, బాచేపల్లి ఎంపీటీసీ కిషన్‌నాయక్, ఖేడ్ బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు నగేష్, నాయకులు బషీర్, ముజమ్మిల్, గోపాల్, నాందేవ్, నర్సింహులు పాల్గొన్నారు.

◆ ఐటీఐ ఏర్పాటు చేయాలని నిరసన

జహీరాబాద్ టౌన్: పట్టణంలో ప్రభుత్వ ఐటీఐని ఏర్పాటు చేయాలని కోరుతూ బీజేవైఎం ఆధ్వర్యంలో శనివారం తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నియోజకవర్గం కన్వీనర్ నరేశ్ పాటిల్ మాట్లాడుతూ ఈ ప్రాంతంలో అధికంగా పరిశ్రమలు ఉన్నా స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు దక్కడంలేదన్నారు. ప్రభుత్వ ఐటీఐలేక యువత శిక్షణ పొందలేక పోతున్నారని వాపోయారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ఐటీఐని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు బస్వరాజ్, సామఅనిల్, జగన్నాథ్, సంతోష్, శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.